క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాసిత్‌నగర్ ఎస్టీ హాస్టల్ ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మోక్ష విల్లాస్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్ల ప్రదర్శన



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవీశరన్నవరాత్రోత్సవాలకు హాజరు కావాలని ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు కోరారు. ఈమేరకు వరంగల్ ఎంపీ కడియం కావ్యను ఆదివారం కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా శర్నవరాత్ర మహోత్సవాల వాల్‌పోస్టర్లను దేవాలయంలో ఆవిష్కరించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

రామన్నపేట: వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఆటోడ్రైవర్లకు మట్టెవాడ ఎస్సై సాంబయ్య ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల ఆటో డ్రైవర్లు సత్ప్రవర్తనతో ఉండాలని అన్నారు. ఆకతాయి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు.

చాకలి ఐలమ్మ, బతుకమ్మ విగ్రహాల ఆవిష్కరణ



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాపువాడలోని భద్రకాళి చెరువు మత్తడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ, బతుకమ్మల విగ్రహాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ 10వ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, నాయకులు సతీష్, మాడిశెట్టి రాజు, బొంత రామకృష్ణ, రావుల సుదర్శన్, విగ్రహదాత గుణిశెట్టి సుధాకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖ జోలికొస్తే సహించం

రామన్నపేట: పద్మశాలి నేత, మంత్రి కొండా సురేఖపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని లేకపోతే తగిన గుణపాఠం చెబుతామని చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి సురేఖ పాల్గొన్న సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల్లో షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జరిగిన ఘటనను తప్పుడు వ్యాఖ్యలతో ట్రోల్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంపత్, మధునయ్య, పెద్ద భద్రయ్య, బూర వేణుమాధవ్, సంపత్ పాల్గొన్నారు.

మోటె చిరంజీవికి గౌరవ డాక్టరేట్



వరంగల్: కవిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, గాయకుడిగా, కాలమిస్ట్‌గా రాణిస్తూ 20ఏళ్లుగా అనేక స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తూ 2017లో మదర్ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మదర్ ఫౌండేషన్ చైర్మన్ మోటె చిరంజీవికి ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ (యూఎస్ఏ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిరంజీవిని ఘనంగా సన్మానించారు.

మెడికవర్‌లో ఐవీయూఎస్ సేవలు ప్రారంభం



కాజీపేట అర్బన్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐవీయూఎస్ సేవలను వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు గుండె ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మెడికవర్‌లో ఇంట్రా విజువల్ ఆల్ట్రా సౌండ్ అధునాతన పరికరాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఎదురుచూపులు

- కరెంట్ కష్టాలు ఎదుర్కొంటున్న పలు గ్రామాల ప్రజలు
- తుది దశకు చేరుకున్న భట్టుపల్లిలోని సబ్ స్టేషన్ పనులు



భట్టుపల్లిలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్



కడిపికొండలో నిలిచిన సబ్ స్టేషన్ పనులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని కడిపికొండతో పాటు చుట్టుపక్కల ఉన్న భట్టుపల్లి, కొత్తపల్లి, రాంపేట గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడిపికొండ కేంద్రంగా భట్టుపల్లిలో ఏర్పాటు చేస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తున్నారు. ఏడాది క్రితం రూ.కోటిన్నర వ్యయంతో మొదలుపెట్టిన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే తమ కష్టాలు తీరుతాయని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు.

నాడు కడిపికొండలో.. నేడు భట్టుపల్లిలో..

ఏడాదిన్నర క్రితం కడిపికొండ గ్రామంలోని రైతు వేదిక పక్క స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టి కొంతమేర పనులు పూర్తిచేశారు. అయితే, ఆ స్థలం కడిపికొండ ఎస్సీ కులస్తులు, ఉద్యోగ సంఘాల నాయకులు తమదంటే తమదని సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దాంతో ఏడాది క్రితం భట్టుపల్లిలో మరో సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టగా, అది నేడు తుది దశకు చేరుకుంది. ఈక్రమంలో ఎప్పుడెప్పుడు సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తారా అని ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కరెంట్ కష్టాలు తీరుతాయి



విద్యుత్ సబ్‌స్టేషన్ లేకపోవడంతో మడికొండలోని సబ్ స్టేషన్‌పై ఆధారపడడంతో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చీటికి మాటికి కరెంట్ పోతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భట్టుపల్లిలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌ను వెంటనే ప్రారంభిస్తే కరెంట్ కష్టాలు తీరనున్నాయి.

- రామిండ్ల బాబురావు, స్థానికుడు

ఉద్యోగ విరమణ సహజం: ఎమ్మెల్యే



కాజీపేట: కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

విద్యారణ్యపురి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సహజమని, అధ్యాపక వృత్తి ఎంతో గొప్పదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ల ధర్మేంద్ర ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందబోతున్న నేపథ్యంలో కళాశాలలో ఆదివారం పదవీ విరమణ సభ జరిగింది. ఈ సభకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షత వహించగా, తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, హనుమకొండ జిల్లా డీఐఈఓ గోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

హన్మకొండ: విద్యార్థులు చదువుతో పాటు కరాటేలో నైపుణ్యం సాధించాలని, కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని రెడ్డి మ్యారేజ్ హాల్‌లో వరంగల్ జిల్లా కియో జపాన్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -2024 పోటీలు ఆదివారం జరిగాయి.

రాణిరుద్రమ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో రూ.22.60 లక్షల వ్యయంతో నిర్మించిన రాణి రుద్రమదేవి కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. సమావేశంలో అబుబక్కర్, నాయిని లక్ష్మారెడ్డి, సాగరిక, రమాకాంత్ రెడ్డి, చామల వాసుదేవరెడ్డి, హేమంత్ రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విద్యావిధానం పేరుతో కాషాయీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

విద్యారణ్యపురి: నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పీడీఎస్‌యూ వరంగల్, హనుమకొండ జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానంతో అశాస్త్రీయ విద్యవైపు మళ్లిస్తున్నారని, ఇది సరికాదన్నారు. విద్యారంగం పట్ల కేంద్ర వైఖరి సరికాదని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనపరుస్తూ ప్రైవేట్, కార్పొరేట్, ఎంఎన్‌సీ విద్యాసంస్థలకు రెడ్‌కార్పెట్ వేస్తోందని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రాష్ట్రంలో రూ.7వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకుడు డాక్టర్ సూత్రపు అనిల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మిస్రీన్ సుల్తానా, నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్‌కుమార్, నాయకులు మర్రి మహేష్, వంశీ, అర్జున్, ముషరఫ్, తదితరులు పాల్గొన్నారు.

గోదామాధవ కేంద్రంలో పితృ ద్వాదశి పూజలు



హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో ఆదివారం ఉదయం పితృ ద్వాదశి పూజలు నిర్వహించారు. ఈ మేరకు గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి మాట్లాడుతూ పితృ రుణం తీర్చుకోవడం అంటే వారు చనిపోయిన తర్వాత ఆడంబరంగా కర్మలు నిర్వహించడం కాదని, వారు బతికున్న సమయంలో వారికి సేవచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆపదుద్ధారక స్వామికి విశేషపూజలు, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. మహాహారతి జరిపి మహానివేదన చేశారు. భక్తులకు ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. కరీంనగర్‌కు చెందిన శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక వ్యవస్థాపకుడు డింగరి శ్రీనివాసామూర్తి, సంపాదకులు సముద్రాల శారద, గోపాలమూర్తి దంపతులు కేంద్రాన్ని సందర్శించి శ్రీసన్నిధానం మాసపత్రికను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీఓ భాగ్యనగరు సత్యనారాయణ, ఆరుట్ల గోదాదేవి, శేషుప్రియ, వెన్నపురెడ్డి రమణారెడ్డి సరళ దంపతులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

గుట్కాల పట్టివేత

రామన్నపేట: నగరంలోని స్టేషన్ రోడ్డులోని గణేష్ కిరాణంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించి రూ.22,500 విలువగల నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. నిందితుడు విష్ణు, గుట్కా విక్రయించిన హేమరామ్ చౌదరి కిరాణం షాపు యజమానికిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న వివరించారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



గాదె సమ్మయ్యను ఆహ్వానిస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ పరిరక్షణలో పనిచేయాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అన్నారు. హనుమకొండలోని కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఆదివారం వరల్డ్ ఫార్మసిస్ట్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ కోర్సు పూర్తిచేసిన వారికి అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని వివరించారు. బీ ఫార్మసీ కోర్సు పూర్తయ్యాక తమ సర్టిఫికెట్‌ను అద్దెకు ఇవ్వవద్దని అన్నారు. అలా అద్దెకు ఇవ్వడమంటే డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్‌ను ఉల్లంఘించడమేనని హెచ్చరించారు. కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, ప్రొఫెసర్ మంజుల, డాక్టర్ పాడి సత్యనారాయణ, డాక్టర్ స్వర్ణ, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు.

టీఎస్‌ఈఈయూను పటిష్టం చేయాలి



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)ను మరింత పటిష్టం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సూచించారు. హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ డివిజన్ నుంచి పలువురు విద్యుత్ ఉద్యోగులు టీఎస్ ఈఈయూలో చేరారు. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు నవీన్ కుమార్, బొజ్జ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ నిసార్ అహ్మద్‌తో పలువురు విద్యుత్ ఉద్యోగులు టీఎస్‌ఈఈయూలో చేరగా వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఇనుగాల శ్రీధర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తున్న యూనియన్ టీఎస్‌ఈఈయూ ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఈఈయూ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి కె.శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి యుగేందర్, హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడు వి.అంజయ్య, కార్యదర్శి సుధాకర్, నాయకులు బి.శ్రీనివాస్, ఐలేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య చరిత్రను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం



కుల సంఘాల నాయకులతో దొడ్డి కొమురయ్య సినీ నిర్మాణ కమిటీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా సినిమాను రూపొందిస్తున్నట్లు సినీ దర్శకుడు సేనాపతి అన్నారు. హనుమకొండ పద్మాక్షికాలనీలోని డాక్టర్ జగదీష్‌బాబు ఆస్పత్రిలో పలు కుల సంఘాలతో సినీ నిర్మాణ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నిర్మాణ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ సాగంటి మంజుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సేనాపతి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం పోరాడిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ప్రపంచానికి మరింత లోతుగా తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ కోచైర్మన్ ధరావత్ రామచంద్ర నాయక్, నిర్మాతలు మండలోజు కృష్ణమూర్తి, కురిమిళ్ల శ్రీదేవి, సాయిబాబా, జిల్లా కన్వీనర్ రావుల సురేష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, గౌడకుల విద్యార్థులు విద్యారంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ ఆకాంక్షించారు. హంటర్ రోడ్డులోని కాకతీయ గౌడ హాస్టల్ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, కౌండిన్య పరపతి సంఘం సౌజన్యంతో 2023 -24వ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన పేద గౌడ విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బండి సాయన్నగౌడ్ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న, కౌండిన్య పరపతి సంఘం అధ్యక్షుడు అంబాల సూర్యనారాయణ గౌడ్, గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈవీ.గొడిశాల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, కేయూ పాలక మండలి సభ్యుడు చిర్ర రాజుగౌడ్, గోపా వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, కౌండిన్య పరపతి ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి గట్టు సత్యనారాయణ గౌడ్, కొండ నరేందర్, బత్తిని రమేష్‌గౌడ్, కోలా ప్రతాప్, సురేందర్, ప్రభాకర్‌గౌడ్, పెరుమాండ్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం వార్షికోత్సవం



అభివాదం చేస్తున్న సంఘం ప్రతినిధులు

విద్యారణ్యపురి: సామాజిక సమస్యలపై పోరాటాల్లో అంబేడ్కర్ యువజన సంఘం ముందుంటోందని, గ్రామగ్రామాన అంబేడ్కర్ యువజన సంఘం కమిటీలను పునరుద్ధరించాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఐలయ్య అన్నారు. సంఘం 48వ వార్షికోత్సవాన్ని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ యువజన సంఘం సమష్టిగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, పలు జిల్లాల బాధ్యులు బొమ్మల అంబేడ్కర్, రౌతు రమేష్, రవీందర్, కాంతారావు, ఎన్.భిక్షపతి, సింగారపు ఎల్లయ్య, దుర్గాప్రసాద్, హరికృష్ణ, తప్పెట్ల వీరన్న, కన్నారపు శివశంకర్, సోమేలు, సిద్దంకి హరి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి



వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కాజీపేట: సైడ్ డ్రెయినేజీలను భారత ఆహార సంస్థ అధికారులు మూసివేయడం వల్ల రహత్‌నగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీ శివారులోని ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో నిలిచిన వ్యర్థ జలాలను సీపీఐ బృందం సభ్యులతో కలిసి పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. కలుషితమైన తాగునీటిని వినియోగించి జ్వరాల బారినపడి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు. వారం రోజుల్లోగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, బొట్టు భిక్షపతి, పూర్ణచందర్, మంద సుమన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కాజీపేటలో రైల్వే మెగా బ్లాక్

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ ఫాతిమానగర్ బైపాస్‌లైన్‌లో ఆదివారం రైల్వే అధికారులు పెద్ద ఎత్తున మెగా రైల్వే బ్లాక్ చేపట్టారు. హసన్‌పర్తి-వరంగల్, హసన్‌పర్తి-కాజీపేట బైపాస్ లైన్ అనుసంధానంతో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులను అన్ని విభాగాలకు చెందిన రైల్వే అధికారులు, కార్మికులు సుమారు 1500 మంది ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు చేపట్టారు.

తాపీ మేస్త్రీల సంఘం కార్యవర్గం ఎన్నిక

రామన్నపేట: వరంగల్ పట్టణ గృహనిర్మాణ తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడిగా దుబ్యాల రాజయ్య ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా దామెర లింగయ్య, ఉపాధ్యక్షులుగా అందుగుల శ్రీనివాస్, సుంకరబోయిన మల్లేశం, సహాయ కార్యదర్శులుగా జంగం రవి, ఎనబోయిన వెంకన్న, కోశాధికారిగా అనిశెట్టి రాంచందర్, స్టోర్ ఇన్‌చార్జ్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి రాంరెడ్డి, ఆర్గనైజర్‌గా సదాశివుడిని ఎన్నుకున్నట్లు వివరించారు.

బీజేపీ జిల్లా కార్యదర్శుల నియామకం

హన్మకొండ: బీజేపీ జిల్లా కార్యదర్శులను నియమించినట్లు ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. దొంతుల వాసుదేవ రెడ్డి, నగునూరి నిర్మలను కార్యదర్శులుగా నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ ఎన్నిక

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల (పీఎస్‌హెచ్‌ఎం) ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదర్శ న్యాయ కళాశాలలో మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌స్వామి, కోశాధికారిగా వేణుగోపాల స్వామి, ఉపాధ్యక్షులుగా వేదాంతచారి, సునంద, సంయుక్త కార్యదర్శులుగా మంత్రి శ్రీనివాస్, శరత్‌గౌడ్, మల్లయ్య ఎన్నికయ్యారు. అలాగే, అసోసియేట్ అధ్యక్షుడిగా హున్యానాయక్, గౌరవ అధ్యక్షుడిగా మార్కండేయ ఎన్నికయ్యారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారులుగా మల్లారెడ్డి, ఉప్పలయ్య వ్యవహరించనున్నారు.

దసరా ఉత్సవ కమిటీ నియామకం

ఖిలా వరంగల్: తూర్పుకోటలో పోచమ్మ ఆలయ ప్రాంగణంలో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ అధ్యక్షతన సద్దుల బతుకమ్మ, దసరా వేడుకల ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ఈమేరకు దసరా ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బోగి సురేష్, సభ్యులుగా బోయిని దూడయ్య, కందిమల్ల మహేష్, సంగరబోయిన విజయ్, గన్నారపు రమేష్, సుంచు జగదీష్, ఎల్లయ్య, వీరస్వామి, వీరన్న, సంగరబోయిన చందర్, ఉమేష్, వాసుదేవ్, రాంబాబు, రాజ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ధర్మరాజు, మేకల కుమార్, శ్రీను, కేశవరాజు ఎన్నికయ్యారు.

రవీందర్ సేవలు చిరస్మరణీయం

ఖిలా వరంగల్: మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోదరుడు నన్నపునేని రవీందర్ సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గుర్తుచేశారు. ఈమేరకు వరంగల్ హంటర్‌రోడ్డులోని ఆకుతోట కాన్వెన్షన్ హాల్‌లో రవీందర్ సంతాప సభను ఆదివారం నిర్వహించారు. సభకు మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, రైతు విమోచన కమిటీ మాజీ రాష్ట్ర చైర్మన్ నాగుర్ల వెంకన్న, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు సన్మానం

ఖిలా వరంగల్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సభ్యుడు కరాటే ప్రభాకర్, తదితరులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కొయ్యడ ఉమ, సంగీత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం



వైద్యులు ఆశాదీప్తి, లావణ్యను సన్మానిస్తున్న జ్యువెలర్స్ నిర్వాహకులు

హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని తనిష్క్ జ్యువెలర్స్‌లో ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆశా దీప్తి, డాక్టర్ లావణ్య, ఫిజీషియన్ డాక్టర్ సనత్ కుమార్‌ను తనిష్క్ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మిత ఆహారం, జీవన విధానంలో మార్పులతోనే గుండె జబ్బులను నివారించవచ్చని వివరించారు. ఒక వయసు వచ్చిన తరువాత క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా మరణాలను నివారించవచ్చని పేర్కొన్నారు. రోజూ వ్యాయామం చేయాలని, జంక్‌ఫుడ్స్, ధూమ, మద్యానికి దూరంగా ఉండాలని తెలిపారు. స్టోర్ బాధ్యుడు యశోద నారాయణ రావు మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే వజ్రాభరణాల విలువపై 20 శాతం వరకు, బంగారు ఆభరణాల మేకింగ్ చార్జెస్‌పై 20శాతం వరకు తగ్గింపు అందించనున్నట్లు వివరించారు. పాత బంగారం మార్పిడిపై పూర్తి విలువ అందించనున్నట్లు ఆయన వివరించారు.

వితంతు కుటుంబాలకు చేయూత



కాజీపేట రూరల్: సమాజంలో వితంతువులకు వారి పిల్లలకు జన వికాస చేయూతనిస్తూ అండగా ఉంటోందని జన వికాస అధ్యక్షుడు లుర్దూ మర్రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాల వికాసలో వితంతువులకు వారి పిల్లలకు జనవికాస ఆధ్వర్యంలో సుమారు రూ.17 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోఫార్ - కెనడాలోని దాతల సహకారంతో 80 మంది వితంతువులు, 184 మంది వితంతువుల పిల్లలకు చేయూనందించినట్లు వివరించారు. మహిళా అభివృద్ధి పథక ప్రోగ్రాం మేనేజర్ లత మాట్లాడుతూ వితంతువులు మనోధైర్యంతో ఉండాలని అన్నారు. తమ పిల్లలను మంచిగా చదివించాలని చెప్పారు. కార్యక్రమంలో సుజాత, అమూల్య పాల్గొన్నారు.